# కనువిప్పు

శేఖరం ఇంటికి వస్తూనే నీరసంగా కుర్చీలో కూలబడిపోయాడు. సుజాత భర్తనాస్థితిలో చూసి ఆశ్చర్యపోయింది. శేఖరం ఆమె ఉనికిని పట్టించుకోలేదు. కాఫీ గ్లాసు అందిస్తూ "ఏమైందండీ? అనారోగ్యంగా ఉందా?" అని ప్రశ్నిస్తూ భర్త నుదుటిమీద చెయ్యివేసింది. జ్వరం వచ్చిన లక్షణాలు లేవు.

"బాగానే ఉంది" అతను సంక్షిప్తంగా ఇచ్చిన జవాబు ఆమెకు తృప్తిని కలిగించలేదు. ఈ అయిదు సంవత్సరాలలో శేఖర్‌ను ఆ స్థితిలో చూసి ఉండలేదు.

ఆమె ఆలోచనలు పరిపరివిధాల పోయాయి.

ఆఫీసులో ఏదో తగవు వచ్చి వుంటుంది. శేఖరం ఎవరితోనైనా తగవు పెట్టుకున్నాడా? ఉహు! అతని స్వభావం అలాంటిది కాదే! తోటి వుద్యోగులు కూడా అతనంటే అభిమానం చూపిస్తారే! మరి...?

తన వారి మీదకు మనసు మళ్ళిందా? ఈ అయిదు సంవత్సరాలై తనవారి ఊసు ఎత్తలేదే? మరి ఇంతలో అకస్మాత్తుగా అలా ఎందుకు మార్పు వచ్చింది?

పైకి అభివ్యక్తి చేయకపోయినా తన వారిని అతను మరిచిపోగలడా? తను మాత్రం తన వాళ్ళను మరిచిపోయిందా? రెండు పక్కల వాళ్ళూ తమతమ మొండిపట్టుదలలతో వుండడం వలన వారిగురించి పైకి అనుకోవడంలేదు. మనసులో నుంచి ఆత్మీయతా అభిమానం తుడుచుకు పోతాయా? అయినా ఈనాడు అకస్మాత్తుగా శేఖరం వాళ్ళ గురించి పరితపించడానికి హేతువేమిటి?

ఔను! నిన్న అతని చిన్ననాటి స్నేహితుడు వచ్చాడు. బహుశా శేఖరం యింటి విషయాలు ముచ్చటించి వుంటాడు. శేఖరం తల్లిదండ్రులు పడుతున్న ఆరాటం, వారు వృద్ధాప్యంలో కుమారునికోసం కుమిలిపోతున్న విషయం, వారికోపం తగ్గిన విషయం చెప్పి ఉంటాడు.

వారికి తమపట్ల కోపం తగ్గి, వుంటుందా? తమని ఆదరిస్తారా? తన వెట్టిగాని అలాంటి మాటైతే శేఖరం తనతో ఆ సంతోషకరమైన మాట చెప్పి ఉండడా? మరి...?

కొందరి జీవితాలలోలాగా శేఖరం మనసు మార్చుకొని, తనను గాలికి వదిలేసి వెళ్ళిపోతాడా? మరి తనగతేంకాను?

పాలపొంగులాంటి యవ్వనంలో ప్రేమపిచ్చిలోపడి ఆ నిషాతగ్గిన తరువాత కష్టాలను ఎదుర్కొనే ధైర్యం సన్నగిల్లి, ఆస్తిపాస్తులమీద అమ్మానాన్నలమీద మనసు మళ్ళి దేవుడి సాక్షిగా పెళ్ళాడిన భార్యను

విడిచివెళ్ళి పోయిన యువకులకధల నెన్నిటిని చదువలేదు? శేఖరం కూడా అలాంటి ఆలోచనలో వున్నాడా? ఈ పెళ్ళి ఈ సంసారం మూడునాళ్ళ ముచ్చటేనా?

'మనపెద్దలు కొన్ని ఆచారవ్యవహారాలను కట్టుబాట్లను నిర్దిష్టం చేసారు. వాటిలో ఏదో మహత్తరమైన శక్తి వుంది. శతాబ్దాలుగా ఈ ఆచారవ్యవహారాలను మనవాళ్ళు తు.చ.తప్పక నిర్వహిస్తున్నారు. విదేశీయుల పాలనలో కూడా మనకట్టుబాట్లు ఇసుమంతైనా సడలలేదు. అందుకే దేశదేశాల సంస్కృతులలో మన సంస్కృతికి ఒక ప్రత్యేకస్థానం ఉంది. అందువలన వీటిని అర్ధవిహీనమైనవని కొట్టిపారవేయలేము. ఇక పెళ్ళిళ్ళనేవి స్వర్గంలో నిర్ణయించబడతాయి. లత ఎలా ఒకేచెట్టును ఆశ్రయించుతుందో అలా మన భారతనారి ఒకే పురుషుణ్ణి ఆశ్రయించుతుంది. విధిరాతను తప్పించటం మానవమాత్రులకు సాధ్యంకానిది. సుజా! భగవంతుడు నీకు సంసారిక సుఖాన్ని ప్రసాదించలేదు. నీ భర్త అకాలమరణం అందుకు తార్కాణం. విధవా వివాహాలు మన వంశంలో లేవు. అలాంటిది నీవు పునర్వివాహం చేసుకోవడం హర్షించతగినది కాదు. మరో పురుషుణ్ణి నమ్ముకుంటే నీ జీవితం నాశనం ఔతుంది. మనం పాశ్చాత్యదేశాల్లో జన్మించలేదు. భారతభూమి మీద జన్మించాం. అందువలన ఈ దేశవ్యవహారాలనే మనం పాటించాలి. భర్త మరణించిన స్త్రీ పునర్వివాహానికి అనర్హురాలని మన శాస్త్రాలు చెప్తున్నాయి. నీవు మారుమనువు చేసుకోవడం మాకు సుతరాం ఇష్టంలేదు. మమ్మల్ని ధిక్కరించి చేసుకుంటే నీకు ఈ ఇంటిలో స్థానం ఉండదు. ముందేం జరుగుతుందో అది మన వూహకందనిది. అంత్యనిష్ఠూరం కన్నా ఆదినిష్ఠూరం మేలు. మేం, నీ మంచి కోరేవాళ్ళం. నీ పిచ్చి వూహలకు స్వస్తిచెప్పు. ఏటికి ఎదురీదాలనుకోవడం మంచిది కాదు అంటూ ఆనాడు అన్నయ్య చేసిన హితబోధలను తానుకొట్టి పారవేసింది.

ఎంత దూరదృష్టితో అన్నయ్య తనను హెచ్చరించాడు.

ఆ రోజున తను శేఖరం మాయమాటల్లో పడింది.

"సుజా! వీళ్ళు స్వార్ధంతో అనే మాటలను నమ్మకు. పురుషులకొక న్యాయమూ - స్త్రీలకొక న్యాయమూనా? భార్య చనిపోతే ఆమె చితికి నిప్పు అంటించి ఆ వెంటనే మరోపిల్ల మెడలో మంగళ సూత్రం కట్టే అధికారం పురుషులకుందిగాని భర్తపోయిన స్త్రీ పునర్వివాహానికి అనర్హురాలా? భర్త చనిపోతే ఆ స్త్రీ శేషజీవితమంతా అన్నదమ్ములకు వారి పెళ్ళాం పిల్లలకు జీతంబత్తెం లేకుండా చాకిరి చేస్తూ, వారు తిడుతూ పడేసిన ఎంగిలి మెతుకులు తింటూ ఆ స్త్రీ కుళ్ళుతూ బ్రతకాలా? ఇది న్యాయమా? మనది పాశ్చాత్యవ్యామోహమని ఎందుకనుకోవాలి? విదేశాలనుంచి తాంత్రిక పరిజ్ఞానాన్ని తెచ్చు కుంటు న్నామే, మరి ఆ దేశంలో వున్న మంచి సంస్కృతులను ఎందుకు నిరాకరించాలి? స్త్రీగా పుట్టడం ఒక శాపమా? సుజా! నామీద నీకు నమ్మకం లేకపోతే అది వేరే విషయం. ఎలాంటి పరిస్థితులలోనూ నీ చేయి విడువను. ఇక నీ యిష్టం" అంటున్న శేఖరాన్ని అవిశ్వసించదానికి ఆనాడు మనసు ఒప్పలేదు. తన వయసనగా ఎంత? నిండా ఇరవైలేవు. పెళ్ళి జరిగి ఏడాదికాలేదు. జీవితంలో తగిలిన ఆఘాతానికి తట్టుకోలేని సమయం. ప్రాచీన సాంప్రదాయాలను వల్లిస్తూ మారుమనువు నిషిద్ధం అన్న మాటలను ఎలా అంగీకరించగలదు?

పెద్ద గాలీవానే వచ్చింది.

పెళ్ళి జరిగిన రెండు సంవత్సరాల వరకు అతని తల్లిదండ్రులతని మీద చాలా ఒత్తిడి తెచ్చారు. 'నా ఆస్తిలో చిల్లిగవ్వ నీకు రాదు. నీకు మాకూ సంబంధంలేదు. నాకసలు మగపిల్లలే పుట్టలేదు అనుకుంటాను. పుట్టినా మా శేఖరం చచ్చిపోయాడనుకుంటాను' అని శేఖరం తండ్రి బెదిరింపులు..... 'నాయనా! విధవరాలితో కాపురం ఏమిటి? లోకం హర్షించదు. జరిగిపోయింది పీడకల అనుకో. మీ నాన్నగారిని నేను ఒప్పిస్తాను. ఆ పిల్లను వదిలేసి ఇంటికి వచ్చేయి. నీకు రంభలాంటి పిల్లనిచ్చి పెళ్ళిచేస్తాం. బాగా డబ్బున్న వాళ్ళు మన ఇంటిచుట్టూ తిరుగుతున్నారు నీకు పిల్లనిస్తామంటూ. సంపన్నుల కుటుంబంలో పుట్టిన నీకు ఈ బీద బ్రతుకెందుకు? అని అతని తల్లి బ్రతిమలాటలు..... శేఖరం! తెలియక చిన్నతనంలో ఏదో చేసావు. వాటి పరిణామాలను ఎదుర్కొనడం కష్టం. ఈ పనిని 'ఎవరూ హర్షించరు. ముసలివాళ్ళైన నీ తల్లిదండ్రులను బాధపెట్టడం కొడుకువైన నీకు తగదు. పొరపాటును దిద్దుకోవటం చాలా వుత్తమం' అని స్నేహితులు చేసే హితవచనాలు.

శేఖరం ఎవరి మాటలు లక్ష్యపెట్టలేదు. లక్షల ఆస్తులను త్యజించాడు. కష్టాలని కావాలని కొనుక్కున్నాడు మరి ఈనాడు....

"ఏమండీ! ఏం జరిగింది? నాకు చెప్పరూ?" అంది. సుజాతకు ఏడుపొచ్చింది.

"సుజాతా! ఎందుకలా ఉన్నావు? ఇప్పుడేం జరిగిందని?"

"ఏం జరగబోతున్నదో అనే నా బాధ"

శేఖరం ఆమె వంక చూసాడు. విషయం తెలియకపోతే ఆమె బాధ పడుతుంది. ఒక నిర్ణయానికి వచ్చాడు.

"సుజాతా! త్వరగా తయారవు. అలా షికారు కెళ్దాం. నాకూ మనసులో సరిగ్గా లేదు" అన్నాడు లేని నవ్వు తెచ్చుకుంటూ. సుజాత అన్యమనస్కంగానే బయలుదేరింది.

★ ★ ★

"ఈ పేనలు నాకు ఆమోదయోగ్యం కాదు".

డైరెక్టరు గారి మాటలు విని కమిటీ సభ్యులు ముగ్గురూ ఆశ్చర్యపోయారు. తమ నిర్ణయాన్ని వారు శంకిస్తున్నారా?

"సార్! మేం ఎలాంటి ప్రలోభాలకు లొంగలేదు. నిజాయితీగా మేం తీసుకున్న నిర్ణయం. అన్ని పరీక్షలలోనూ ప్రప్రథమురాలిగా ఆమె ఎన్నికైంది. మమ్మల్ని అనుమానించడం భావ్యంకాదు" అన్నాడు కరుణాకరం.

"కరుణాకరంగారూ! మీరు నన్ను అపార్థం చేసుకుంటున్నారు. మీ ఎన్నికలో తప్పు ఉందని కాని మీరు పక్షపాతంగా వ్యవహరించారని కాని నేను భావించటంలేదు."

కరుణాకరం తృప్తి పడ్డారు. అధికారి దృష్టిలో తమపట్ల ఎలాంటి అపార్థంలేదు.

"మరి మీ దృష్టిలో మరో అభ్యర్థి వున్నాడా? లేక పైనుంచి ఏమైనా రికమెండేషన్లు వచ్చాయా? అలాగైతే చెప్పండి. ఈపేనలు దేముంది? మార్చుతాం."

"కరుణాకరం? నేను ఎవరిమీదా ప్రత్యేక అభిప్రాయంతో లేను. ఎలాంటి రికమెండేషన్లకు విలువివ్వను."

"మరి...?" ప్రశ్నించాడు వెంకటనారాయణ.

డైరెక్టరు రెండు నిమిషాలు ఏమి చెప్పలేదు. ఆ ముగ్గురూ సంగతి తెలియక అయోమయస్థితిలో కుర్చీలలో కదలకుండా కూర్చున్నారు.

"నాది సంకుచిత స్వభావమని మీరు భావించినా నేను బాధపడను. మహిళలు అనంతశక్తి సంపన్నులని మన ఋషులు వాక్రుచ్చేరు. అహల్యా, ద్రౌపదీ, సీతా, తారా, మండోదరి తథా పంచకన్యాన్ స్మరే న్నిత్యం మహాపాతక నాశనం అని పురాణాలలో వ్రాయబడివుంది. అయితే ఆ ప్రవచనాలు ఈనాడు కాలదోషం పట్టినవి. స్త్రీల విషయంలో కాలదోషం పట్టని ప్రవచనాలు కొన్ని వున్నాయి. ముఖ్యంగా, స్త్రీ బుద్ధి ప్రళయాంతకః, విత్తమూ బుద్ధీ కూడా అధమాధమమూ ప్రళయాంతకమునూ అవి స్త్రీవైతే! ఆడదంటే అబలకాదని నేటి సోదరీమణులు చెప్తున్నారు. ఆడది అబల అన్నది ఏ సత్య కాలంలోనో. ఆడది సబల అన్నది అనుభవపూర్వోక్తి. కొన్ని సందర్భాలలో ఆడది ప్రవర్తించినంత సంకుచితంగా, నీచంగా, కఠినంగా, కఠోరంగా, నిష్కర్షగా, నిర్దాక్షిణ్యంగా, అవమానంగా, అమానుషంగా, అసందర్భంగా, అవివేకంగా పురుషుడు ప్రవర్తించలేడు. కొన్ని చోట్ల ఆడది విలయతాండవం చేస్తున్నది. తన పరిధిలను దాటి ప్రవర్తిస్తున్నాది. మహాసాధ్విగా దేవతగా మన మనసులలో నిలిచిన సీతాదేవి లక్ష్మణరేఖను దాటి పడరాని ఇడుములు బాసింది. ఈనాటి మహిళలు సబలలమంటూ లక్ష్మణరేఖను దాటుతున్నారు. మన పూర్వులు నిర్దేశించిన కట్టుబాట్లను తెంచుకొని విశృంఖలంగా ప్రవర్తించి అటు కన్నవారిని ఇటు అత్తింటివారిని కష్టపెడుతున్నారు. వారిని దుఃఖభాజనులు చేస్తున్నారు. కొందరి కొంపలను కూలుస్తున్నారు. ఆ తరువాత కులటలుగా పతితలుగా జీవిస్తూ నిండు సంసారాలలో చిచ్చు పెడుతున్నారు. మీరు ఈ పదవికి ఒక స్త్రీని ఎంపిక చేసారు. అది నా సిద్ధాంతాలకు వ్యతిరేకం" అన్నాడు డైరెక్టరు శాస్త్రి.

శేఖరం నిశ్చేష్టుడయ్యాడు. ఈ ఇరవైయ్యో శతాబ్దపు వుత్తరార్థంలో ఇలాంటి మూఢులుంటారా? ఉంటారు! తను తన జీవితంలో ఎందరినో చూసాడు. ఎంతో దూరం ఎందుకు? తన నిజజీవితంలోనే తారసపడ్డారు. ఆడదాన్ని అణిగి తొక్కాలనుకున్నారు. ఆడది సుఖసంతోషాలతో జీవించటంచూసి సహించలేక కళ్లలో నిప్పులు పోసుకున్నారు. అభ్యుదయ భావాలను వారు సహించలేరు. కన్నకూతురినైనా, స్వంత చెల్లినైనా కోడలినైనా వారు తమ శత్రువుగా భావిస్తారు, తమ మాటను కాదంటే.

"సార్! అన్నీ తెలిసిన మీరు ఇలా అనడం భావ్యం కాదు. ఆడవాళ్లమీద పెద్దఅభాండం. మూఢనమ్మకాలతో, అంధవిశ్వాసాలతో ఆడజాతిని అవమానించటం ఆమోదయోగ్యం కాదు. రాధ చాలా తెలివైన పిల్ల, ఆమె కడు పేదరాలు. ఎన్నో కష్టాలను ఎదుర్కొని, చదివింది. నలుగురితో పోటీచేసి ఆ పోటీలో నెగ్గింది. అలాంటి రాధ ఈ ఉద్యోగానికి అనర్హురాలు అనడం సబబు కాదు" అన్నాడు శేఖరం.

"శేఖరం! నేను చెప్పాలనుకున్నది సూటిగా చెప్పాను. స్త్రీలపట్ల అందులో పెద్ద చదువులు చదివి వుద్యోగాలకు ఎగబడే స్త్రీలపట్ల నాకు సదభిప్రాయంలేదు. ఆడది గృహలక్ష్మి. తన ఇల్లూ, తన పిల్లల భవిష్యత్తును సరిదిద్దుకోవడం ఆమె జీవిత లక్ష్యం. అంతేకాని ఉద్యోగాలు చేయాలని ఊళ్లేలాలని ముందుకు రావడం నేను సహించలేను. నేను స్త్రీ ద్వేషినని మీరు భావించినా నేను

బాధపడను. కులస్త్రీలను నేను గౌరవిస్తాను. ఆడవారిని అందలమెక్కించి వారి ద్వారా కొన్ని కుటుంబాలు సర్వనాశనమైతే నేను భరించలేను. కీడెంచి మేలెంచాలన్నారు. మీరు నాతో ఏకీభవించాలని నేను ఒత్తిడి చెయ్యడంలేదు. ఇది మీ అంతిమ నిర్ణయం అన్నా నేను బాధపడను. నా అధికారాలను వినియోగించి ఇదే పేనలులోని రెండవవ్యక్తిని నేనే నియమించగలను. ఆ తరువాత మీరు ఏం అనుకున్నా ప్రయోజనం ఉండదు."

కరుణాకరం వెంకటనారాయణా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. నిజమే! అధికారిని ఎదిరించి సాధించగలిగేది ఏమీలేదు. అతను చేయాలనుకున్నది చేయగల సమర్థుడు. రూల్సు అతని పక్షంలో వున్నాయి. పోతే అతని ఆగ్రహానికి గురి కావడమే మిగులుతుంది. తద్వారా కొన్ని సదుపాయాలను కోల్పోయే అవకాశం ఉంది.

"దానికేముంది సార్! ఈ పదవిలోకి ఎవర్ని తీసుకున్నా మానినా మాకు ఒరిగేది ఏమీలేదు. మీకు రాధను నియమించటం ఇష్టం లేనప్పుడు మేం మాత్రం ఎందుకు ఒత్తిడి తెస్తాం? మీ యిష్టప్రకారమే పేనలులో మార్పులు చేస్తాం. ఏమంటారు వెంకటనారాయణగారూ?" అన్నాడు కరుణాకరం.

"అనేది మాత్రం ఏముంది? పైవాళ్ళమాటను కొట్టిపారేయడం మాత్రం మంచిదా? అలాగే చేద్దాం" అన్నాడు వెంకటనారాయణ.

"కాదు. అందుకు నేను సమ్మతించను. నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి అన్నది ముమ్మాటికీ కాలదోషం పట్టిన ప్రవచనం. ఋషులు, మహాదాతలు, త్యాగులు ధర్మపరిపాలకులు జనించిన దేశం మన భారత దేశం. అనాది నుంచి స్త్రీలు మన దేశసౌభాగ్యంకోసం పురుషులతోపాటు సమానంగా పరిశ్రమించు తున్నారు. స్వాతంత్ర్యసముపార్జనలోనూ దానిని నిలుపుకోవడటం కోసం మహిళలు ముందంజ వేసారు కాని ఏనాడు వెనుకడుగు వేయలేదు. మీకు తెలియదని కాదు, విజయలక్ష్మీ పండిట్, సరోజినీనాయుడు, కమలాదేవి చటోపాధ్యాయ, కస్తూర్బాగాంధీ, వేదాంతం కమలాదేవి, జయంతి సూరమ్మ, దుర్గాభాయి దేశ్‌ముఖ్, ఆనాడు భారతజాతి దాస్య విమోచనానికి పాటుపడితే ఈనాడు సుచేతాకృపలానీ, ఇందిరా గాంధీవంటి మహిళామణులు స్వాతంత్ర్యపరిరక్షణకోసం పాటుపడలేదా? అలాంటి మహామహిములైన వనితలను సంకుచితంగా తలంచటం శోచనీయం కాదా? కొందరు స్త్రీలు నిస్సంశయంగా విశృంఖలంగా ప్రవర్తిస్తూ ఉండవచ్చును. అలాంటివారు పురుషులలో మాత్రం లేరా? ఒక తప్పుదారిని ప్రవర్తిస్తే ఆ జాతి మొత్తాన్నే తూలనాడటం వారిని నిర్బంధంలో వుంచటం వివేకపూర్వమైన నిర్ణయం ఎలా కాగలదు? ఒక అబల నోటిముందు కూడును నేను పడగొట్టలేను. నాకు తెలుసును. నేను అమె పక్షంగా మాట్లాడినా ఫలితం శూన్యం. అంతిమవిజయం మీదే. మీరు అధికార సంపన్నులు. అలాగని నేను మీ భజనమండలిలో చేరి మీరు చేసే ప్రతీపనికి ఆమోదముద్ర వేయలేను. నా ధర్మాన్ని నేను త్యజించలేను. నేను విశ్వసించే సిద్ధాంతాలకు తిలాంజలి ఇవ్వలేను." అన్నాడు శేఖరం.

"శేఖరం! అవేశం పనికి రాదు. నీవన్నది యథార్థం కాదని మేం కొట్టిపారేయడంలేదు. ఆఫీసరు గారు ఇలాంటి నిర్ణయం తీసుకున్నారంటే దానికి ప్రబలమైన కారణాలు వుంటాయి. వారన్న దానిలో దోషం పట్టే అవకాశాలులేవు. మనం చూస్తున్నాం. నేడు చాలామంది స్త్రీలు వుద్యోగాలకు ఎగబడు తున్నారు. అది వాళ్ళకు ఒక సరదాగా మాత్రమే ఉంది. అలాగ వుద్యోగాలు చేస్తున్న వారిలో కొందరు

హద్దులు దాటకున్నా వారి అలంకరణలతో, వారి హావభావ ప్రకటనలతో పురుషులను సన్మార్గం నుంచి తప్పిస్తున్నారు. పదభ్రష్టులను చేస్తున్నారు. ఏపుట్టలో ఏపాముందో ఎవరికి తెలుసు. రాధకు వుద్యోగం ఇవ్వనంత మాత్రాన మనకు వచ్చిన నష్టం ఏమిటి? ఉద్యోగం పురుషలక్షణం అన్నారు కాని స్త్రీ లక్షణం అనలేదు. ఇంత చిన్న విషయానికి మనలో మనస్పర్ధలూ విభేదాలు ఎందుకు?" అన్నాడు వెంకటనారాయణ.

"ఇది మీ దృష్టిలో చాలా స్వల్పవిషయంగా వుండవచ్చును. ఒక ఆడదానికి అన్యాయం జరుగుతే నేను సహించలేను. అందులోనూ రాధ పరిస్థితి నాకు తెలుసు. ఒక కుటుంబం ఆమె మీద ఆధారపడి ఉంది. మీరు ఎలాగూ ఒక నిర్ణయానికి వచ్చారు. దానిని మార్చగలిగిన శక్తి నాలోలేదు. అందువలన నేను వేరే నిర్ణయం తీసుకోవలసి వస్తున్నాది. నా పదవికి రాజీనామా ఇస్తున్నాను." అన్నాడు శేఖరం. శేఖరం అక్కడ పేడ్‌లో వున్న కాగితం తీసుకొని రాజీనామా పత్రం రాసి డైరెక్టరుకి అందించాడు చిరునవ్వుతో.

ఆ చిరునవ్వు వెనుక ఎంత బాధ మిళితమై వున్నదో శాస్త్రికి అనూహ్యం కాదు.

"ఒక అబల విషయంలో మీ పట్టుదల సమంజసం కాదు. నేను ఎలాంటి పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకున్నానో బహుశా మీకు తెలియదు. ఆమెకోసం మీరు మీ వుద్యోగాన్ని వదలుకోవడం మూర్ఖత్వమే అవుతుంది" అన్నాడు శాస్త్రి.

"సర్! ఆమెను మీరు అబల అంటున్నారు. అయినా ఆమె ధైర్యంగా నలుగురి మధ్యకు వచ్చి ఒక చిన్న వుద్యోగం చేసుకుంటూ గౌరవంగా తన కుటుంబాన్ని పోషించుకుంటూ తమ్ముడిని చెల్లెళ్లను వృద్ధిలోనికి తేవాలని ఆరాటపడుతూ వుంటే ఆమెకు చేయూత నివ్వగల తాహతు వుండి కూడా మనసులో ఏదో వుంచుకొని ఆమెకు అన్యాయం చేయపూనుకున్నారు. కాలంతోపాటు మార్పు ప్రకృతిసిద్ధం. అర్ధశతాబ్దం క్రిందటి స్త్రీ జీవితానికి ఈనాటి స్త్రీజీవితానికి చెప్పలేనంత తేడా వుంది. ఈనాడు ప్రజల జీవనంలో బ్రహ్మాండమైన మార్పు వచ్చింది. ఈ మహా పరిణామంలో జీవనస్థాయి పెరిగిపోయింది. ఒకే ఒక్కరి అర్జన మీద జీవితాలు గడవడం అసాధ్యమైంది. అందుకే కొన్ని మధ్యతరగతి కుటుంబాలలో స్త్రీ పురుషులుకలిసి కష్టించి పనిచేస్తేనే కాని వారి కడుపులు నిండే దారి లేదు. అందులో మగదిక్కు లేని రాధవంటి సంసారాల మాటేమిటి! చూడండి. ఎవరి సిద్ధాంతాలు వారివి. మాటలతో ఒకరి మనసు మార్చివేయగలం అనుకోవడం శుద్ధపొరపాటు. మీరు ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారని అడగను. అయితే నా నిర్ణయం కూడా తిరుగులేనిది. వస్తాను" అన్నాడు శేఖరం.

★ ★ ★

"ఎంత పనిచేశారు! ఇంత చిన్న విషయానికి మీరు వుద్యోగానికి రాజీనామా చేసారా?" అంది సుజాత.

"సుజా! ఏమంటున్నావు? చివరకు నీవు కూడా నా నిర్ణయాన్ని హర్షించలేకపోతున్నావా? ఇది నీకు చిన్న విషయంగా కనిపిస్తుందా?" శేఖరం హృదయం దావానలంలా మండిపోతున్నా చివరకు తన భార్య కూడా తనను అర్థం చేసుకోనందుకు బాధపడ్డాడు.

"కాదండి! మిమ్మల్ని అర్థం చేసుకోలేకకాదు. అయినా ఇది తొందరపాటు నిర్ణయం కాదా?

ఒక పెర్మనెంటు వుద్యోగాన్ని ఒక సెంటిమెంటుతో వదులుకుంటారా? రేపు మనగతి ఏమౌతుందని ఆలోచించారా? మన బాబుని కాన్వెంటులోవేసే వేళ వచ్చింది. వాడి చదువుకు సంరక్షణకు బోలెండంత ఖర్చు అవుతుంది. రేపటినుంచి మనం ఏం తిని బ్రతుకుతాం అనుకున్నారు? ఇలాంటి ఉద్యోగం దొరికే అవకాశాలున్నాయా? ఏ నిర్ణయం తీసుకునేముందైనా తన, తనవారి భవిష్యత్తు విషయం ఆలోచించాలని నేనడం అసందర్భంగా వుందా?"

సుజాత మాటలు విని శేఖరం ఆశ్చర్యచకితుడయ్యాడు. ఏదైనా ఒక భావానికి పూర్తిగా లొంగి పోవడం లౌకిక దృష్ట్యా అవివేకం కావచ్చు. పామరులలో మూఢత్వాన్ని పోగొట్టవచ్చుగాని చదువుకున్న వారిలోని మూఢత్వం పోగొట్టడం ఎలా? సుజాత స్త్రీ అయివుండి కూడా తనగురించే ఆలోచిస్తున్నాది. సాటి ఆడదాని పట్ల కనీససానుభూతి లేదా? తన హృదయవేదనను అర్థం చేసుకోలేదా? ఇదా తను సుజాతనుంచి ఆశించినది.

"లేదు. సుజా! నీవు అన్నదానిలో అసందర్భం ఎక్కడ? నీకు నీ బ్రతుకే ముఖ్యం. ఇతరులు అష్టకష్టాలు పడినా నీకు చీమకుట్టినట్లయినావుండదు. నేనే తెలివితక్కువవాడిని. ముందు చూపులేకుండా ప్రవర్తిస్తున్నాను. ఇప్పుడు నేను నాతప్పును అర్థం చేసుకుంటున్నాను."

శేఖరం మాటలు విని సుజాత సంతోషించింది. నిక్షేపంలాంటి వుద్యోగం ఎవరో అనామకురాలి కోసం వదులుకోవడం అవివేకం.

"అయితే రాజీనామాను ఉపసంహరించుకుంటున్నారా?"

శేఖరం ఆమె వంక రెండునిమిషాలపాటు అదోలా చూసాడు. ఆ రెండు నిముషాలు ఆమెకు అతి భయంకరంగా అనుపించాయి. ఏమిటి శేఖరం ఎగతాళికి అలా అన్నాడా? అతని మనసులో ఏముంది?

"సుజా! నీవు అర్థం చేసుకుంటావనుకున్నాను. అయితే నీవు అందరిలాంటి దానివేనని నిరూపించుకున్నావు. ఈ వుద్యోగం పోయినా మరొకటి దొరకగలదు అన్న నమ్మకం నాకుండేది. ఇప్పుడు నేను తప్పు చేసానేమోనని నేను భావిస్తున్నాను. నీవూ సంకుచితంగానే ఆలోచించగలవని నేను వూహించ లేదు. ఏరుదాటి తెప్ప తగలెయ్యడం అంటే ఇలానే వుంటుంది. నాకు కనువిప్పు కలిగించావు. నాకోసం మా వాళ్ళు కలవరిస్తున్నారు. అయితే ఇన్నాళ్ళు ఏవో సిద్ధాంతాలూ చట్టుబండలూ అంటూ ఎవరినీ లక్ష్యపెట్టలేదు. మన బాబుని నీవు వుంచుకున్నా సరే లేదా నాకు ఇచ్చినా సరే. లక్షలకు వారసుడ్ని యిలా బీద బ్రతుకు బ్రతికే అవసరం నాకెందుకు?" అంటూ సుజాత కళ్ళలోనికి సూటిగా చూసాడు.

సుజాత గుండెలమీద పిడుగులు పడ్డాయి. శేఖరం అంటున్నదేమిటి? తనను విడిచి వెళ్ళిపోతాడా?

"ఏమండీ! ఏమంటున్నారు? మిమ్మల్ని నమ్ముకొని మా వాళ్ళను కాదని మీవెంట వచ్చానే. మరి నాదారి ఏంకాను?"

"ఇలాంటి చిన్న విషయాలు నేను ఆలోచించదలచుకోలేదు. నా వుద్యోగం పోనేపోయింది. కనీసం నీవైనా నన్ను అర్థం చేసుకోగలవనుకున్న నా ఆశ నిరాశ అయింది. నా వాళ్ళు నన్ను ఆదరిస్తారన్న నమ్మకం వుంది. ఇంక నీ బ్రతుకు సంగతి నాకు అనవసరం" అన్నాడు.

సుజాతకు దుఃఖం పొరలుకు వచ్చింది.

"మీరింత కఠినంగా అంటారని అనుకోలేదు. పొరపాటే! మీరు చేసిన పని తప్పుకాదు. మీసంగతి తెలిసి కూడా మిమ్మల్ని అవమానించాను. నేను సంకుచితంగానే ఆలోచించాను. నేనే సాటి స్త్రీ పరిస్థితి గురించి యోచించకుండా నాస్వార్థం చూసుకున్నాను. నన్ను మన్నించండి. మీకు నామీద కోపంలేదుకదూ? ఇదంతా నటనేకదూ? చెప్పండి" సుజాత శేఖరం చేతులు పట్టుకుంది.

"సుజా! నటనా జీవితం వేరువేరుకావు. నటనలోనే జీవిస్తాడు. జీవిస్తూనే నటిస్తాడు. మనిషి కొన్ని సిద్ధాంతాలను నమ్ముతాడు. వాటిని పాటించడం అతని కర్తవ్యం. గోడమీద పిల్లిలా, ఏ ఎండకా గొడుగు పట్టుతూ జీవిస్తే అందులో జీవన మధురిమ ఏది? సుఖ సంతోషాలలోనే కాదు, కష్టాలలోనూ తను నమ్మిన సిద్ధాంతాలను పాటించాలి. తనకొక న్యాయమూ – పైవాడికొక న్యాయమూ పనికిరాదు. రాధ విషయంలో నేను తీసుకున్న నిర్ణయం క్షణికావేశంలో తీసుకున్నది కాదు. నీవు హర్షించకపోతే బాధపడ్డాను. తనదాకా వస్తేనే కాని బాధా బాధ్యతా తెలియవు".

"నిజమేనండి! నాది తొందరపాటే. నన్ను క్షమించండి" అంది సుజాత.

"భార్యభర్తల మధ్య క్షమాపణలకు స్థానం లేదు. నీవు చివరికైనా నేను తప్పుపని చేయలేదని గ్రహించావు. నారు పోసినవాడు నీరు పోస్తాడు" నవ్వుతూ శేఖరం లేచాడు. తేలికైన గుండెతో సుజాత అతన్ని అనుసరించింది.

★ ★ ★

కాలింగ్‌బెల్ మ్రోతవిని తలుపుతీసింది సుజాత.

ఎదురుగా కనిపించిన దృశ్యాన్ని చూసి ఆమె ఆశ్చర్యపోయింది. ఇది కలా – నిజమా? "జీవితంలో నీముఖం చూడను. నీవేనాడైతే మన కట్టుబాట్లను ప్రతిఘటించి మారుమనువు చేసుకున్నావో ఆనాడే నీవు లేవనుకున్నాము" అని నిష్ఠూరంగా బాంధవ్యాన్ని తెంచుకున్న అన్న, గత అయిదు సంవత్సరాలుగా తన వూసు తలచుకోని అన్న, తన ఇంటికి వచ్చాడా? తన వునికిని తెలుసుకొని వచ్చాడా? ఒంటరిగా కాక భార్యా పిల్లలతో వచ్చాడా?

"అన్నయ్యా! ఎన్నాళ్ళకు?" అంది ఆనందాశ్చర్యాలతో.

రామశాస్త్రి కూడా ఈ హఠాత్పరిణామానికి ఆశ్చర్యపోయాడు. తనెవరింటికి వచ్చాడు? ఎంత పొరపాటు జరిగింది!?

"ఇది శేఖరం ఇల్లుకాదా?"

"ఇది శేఖరంగారి యిల్లే. నేను వారి ఇల్లాలిని" అంది కన్నీళ్ళు వత్తుకుంటూ.

"ఇలా నీ గుమ్మం తొక్కవలసి వస్తుందని నేను ఊహించలేదు. అతనితో పనివుంది. రేపే ఒకమారు శేఖరాన్ని ఆఫీసుకి రమ్మనమని చెప్పు" అన్నాడు.

"అన్నయ్యా! మా ఇంటిలోకి రాలేవా? అయిదేళ్ళయినా నీలోని కాఠిన్యం కరగలేదా? వదినా పిల్లలతో వచ్చినవాడివి ఇలా గుమ్మంలోంచి వెళ్ళిపోతావా? ఆయనకీ సంగతి తెలుస్తే మిమ్మల్ని ఆదరించలేదని నన్ను ఆడిపోసుకోరా? పోనీ నీ చెల్లెలు ఇల్లు కాదనుకో, నీ క్రింది ఉద్యోగి ఇల్లేననుకో. నేనిచ్చే చల్లనినీళ్ళు త్రాగి వెళ్ళండి" అంది అర్థింపుగా.

రామశాస్త్రి భార్యకు పరిస్థితులు అర్థమయ్యాయి. ఈ ముక్కుపచ్చలారని పిల్లమీద తన భర్తకెంత కోపం! ఆమె చేసిన తప్పిదం ఏం వుంది? శేఖరం వంటి ఉన్నతుడిని చేపట్టడం ఆమె తప్పా?

"ఏమండి! మరీ ఇంత కరుకుదనం పనికిరాదు. పాపం మీ చెల్లెలు చేసిన తప్పేమిటి? మీరు లోనికి రాకున్నా నేను యింతదూరం వచ్చి తిరిగి వెళ్ళలేను" అంది.

రామశాస్త్రి రెండు క్షణాలపాటు కింకర్తవ్యవిమూఢు డయ్యాడు. శేఖరాన్ని వదలుకోవడం అతనికి ఇష్టంలేదు. పాలపొంగులాంటి వయస్సులో అతడు తొందరపడి తీసుకున్న నిర్ణయం. అతణ్ణి సమాధాన పరచాలనుకున్నాడు. సుజాత, తెలిసీ తెలియని జ్ఞానంతో మళ్ళీ పెళ్ళీ అనే గోతిలో దూకుతున్నాదని అనుకున్నాడు. ఈ వేడి కొంతకాలానికి తగ్గి భార్యాభర్తల మధ్య కలహాలు అంకురించి వారు విడిపోతారు. అప్పుడు తన చెల్లెలి బ్రతుకు పులివిస్తరాకు అవుతుందనే అనుకున్నాడు. అయితే తను చూస్తున్నదేమిటి? శేఖరం నిజంగానే తను నమ్మిన సిద్ధాంతాలను పాటిస్తాడు. తన చెల్లెలీనాడు సుఖసంతోషాలతో వుంది. తన ఆంక్షలను పాటించి వుంటే.... ఆమె బ్రతుకు అడవికాచిన వెన్నెలలా నిరర్థకమై వుండేది.

రామశాస్త్రి చిరునవ్వుతో లోనికి నడిచాడు.

సుజాత వాళ్ళకు చల్లని పానీయాలు ఇచ్చింది.

"చెల్లీ! నిన్నిలా కలుస్తానని అనుకోలేదు. ఒక చిన్న పట్టుదల మీద శేఖరం తన వుద్యోగానికి రాజీనామా ఇచ్చాడు. నేను స్త్రీలకు వుద్యోగాలు యివ్వడం మంచిది కాదంటూ భావిస్తూ వచ్చాను ఇంతకాలం. ముఖ్యంగా ఆనాడు నీవు తీసుకున్న నిర్ణయంతో స్త్రీ విద్య పట్ల స్త్రీలవుద్యోగాలపట్ల నాకు సదభిప్రాయం మిగలలేదు. నా పట్టుదల వెనుక గల కారణాన్ని అతనికి చెప్పి తిరిగి పనిలో చేరమని అడగాలని వచ్చాను. అయితే అతణ్ణి యిప్పుడు అర్థం చేసుకోగలిగాను. నేను మూర్ఖంగా ప్రవర్తించి మిమ్మల్ని యింతకాలం దూరం చేసుకున్నాను. నాకు యిప్పుడు కనువిప్పు కలిగింది. రాధకు తప్పక వుద్యోగం ఇస్తాను. శేఖరాన్ని పనిలో చేరమను" అంటూ రామశాస్త్రి లేచాడు.

"అన్నయ్యా! అప్పుడే వెళ్ళిపోతావా? ఈపూట ఇక్కడ భోజనం చేసి వెళ్ళండి."

రామశాస్త్రి ఏమని జవాబు చెప్పాలనుకున్నా అప్పటికతని భార్య వంటింటిలోకి వెళ్ళిపోయింది.

**(ఆంధ్ర సచిత్ర వారపత్రిక 26 జూన్ 1987)**